# నిరంతర సత్యాన్వేషి

- గంటి భానుమతి

ఆపరేషన్ థియేటర్ ముందు చాలామంది వున్నా శ్మశాన నిశ్శబ్దం. అచేతనంగా సుందరమ్మగారి మీద వాలిపోయి, మూసుకున్న తలుపులకేసి ఆశగా చూస్తోంది నీరజ.

కళ్లముందు అగాధాల చీకటి. కొన్ని వందల అమావాస్యల చీకటి.

జీవితానికి ఆశలు కల్పించిన యశ్వంత్, ఆ మూసిన తలుపుల వెనకాల ఒంటరిగా మృత్యువుతో పోరాడుతున్నాడు.

జీవితం ఇంత చిన్నదా!

తన కళ్లముందు ఏక్సిడెంట్! యశ్వంత్‌కే ఎందుకు జరగాలి?

ఒక్క క్షణంలో ఎంత మార్పు!

రెండు గంటల ముందు యశ్వంత్‌కి ఇప్పుడు యశ్వంత్‌కి ఎంత తేడా? యశ్వంత్‌కు ఏమయినా అయి? ఆ ఊహ చాలా భయంకరంగా వుంది.

'దేవుడా! యశ్వంత్‌ని కాపాడు. బతికించు. నాకు జీవితంలో ఉన్నది యశ్వంత్ ఒక్కడే. ఇద్దరం కూడా అందరికీ దూరం అయ్యాం. నాకు ఎవ్వరూ లేరు. యశ్వంత్‌ని బతికించు' కళ్లు మూసుకుంది.

కళ్ళు తెరిచినప్పుడల్లా రెప్పల అడుగున నీటిలో జీవితం మసక మసకగా అగమ్యంగా కనిపిస్తోంది.

కళ్ళు మూసుకునే అంతకు ముందు రోజు సాయంత్రం టాంక్‌బండ్ దగ్గర గడిపిన క్షణాలు గుర్తుకొచ్చాయి.

***

అర వెలుగు... అరచీకటి...

వీస్తున్న గాలికి ఎగిరిపోతున్న జుట్టుని సవరించుకుంటూ రంగు మారుతున్న నీళ్లని చూస్తూ నుంచున్నారు యశ్వంత్, నీరజ.

"సత్యాన్ని కనుక్కున్నాను" హఠాత్తుగా అన్నాడు.

పకాలున నవ్వింది నీరజ.

"నీకు తెలుసో లేదో కానీ సత్యాన్వేషికి సమాధానం స్క్వేర్ రూట్ ఆఫ్ మైనస్ వన్. మరి నువ్వు కనుక్కున్న సత్యం ఏమిటో?"

"అబ్బా నీరజా! [illegible]. మనిద్దర్ని మనవాళ్ళు వెలివేయడానికి కారణం?"

"ఓయబ్బో! పెద్ద సత్యాన్ని కనుక్కున్నావు. కొండంతా తవ్వి ఎలుకను పట్టినట్లుగా ఉంది నీ సత్యాన్వేషణ. నీ సత్యాన్ని ఏ చిన్నపిల్లాడ్ని అడిగినా చెప్పేవాడే. మన కులాలే కారణం ఆ సంగతి నీకు తెలీదా?"

"ఈ కులాలన్నీ మనుషులు సృష్టించినవే. మనం వీటికి అతీతంగా ఉందాం. మనిద్దరం మనుషులం, మానవులం. మనిద్దరి మధ్యా ఉండాల్సిన బంధం మనిషికి మనిషికి మధ్యన ఉండాల్సిన మానవతా బంధం. ఆ బంధం జీవితాంతం తెగకుండా కాపాడుకోవాలి. అందుకు మనిద్దరం కూడా కృషి చేయాలి."

***

అలా పెళ్లి చేసుకున్న యశ్వంత్ ఈ విశాల ప్రపంచంలోకి నీరజని ఒక్కదాన్నీ వదిలేసి తన దారి తాను చూసుకుంటాడా?

నిన్నటికి ఇవ్వాల్టికి ఎంత తేడా?

నిన్నటిది జ్ఞాపకం కోసేస్తున్నట్టుగా ఉంది. ఈ రోజు జీవితాన్ని అర్థం చేసుకునే జ్ఞానం అయోమయంలో పడేస్తోంది.

అంతసేపు టాంక్‌బండ్ మీద కూచుని భావి జీవితం గురించిన కలలు, ఊహలు మాట్లాడుకున్నారే... అవన్నీ అలా గతంలోనే ఉండిపోవాలా? యశ్వంత్‌కి ఏమీ కాకూడదు!

నిశ్శబ్దంగా ఉంది కారిడార్. చాలామంది వెళ్లిపోయారు.

"తలకి పెద్దగా దెబ్బ తగిలింది. ఎముకలు బాగా విరిగాయి. రక్తం బాగా పోయింది. ఆపరేషన్ చేయాలి" అన్న డాక్టర్లు ఆపరేషన్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

ఆపరేషన్ సరిగ్గా అవుతుందా!

కళ్లముందే యాక్సిడెంట్. ఒక్క తృటిలో... అర సెకండులో చూస్తుండగానే...

ఇద్దరూ ఆఫీసు నుంచి హీరోహోండా మీద వస్తున్నారు. ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర అప్పుడే ఎర్ర లైటు పడడంతో ఆగాల్సి వచ్చింది.

"యశ్వంత్! మామిడిపళ్ళు చాలా బాగున్నాయి. నేను కొని రోడ్డు దాటి ఆ కార్నర్‌లో వుంటాను. నువ్వు సిగ్నల్ క్లియర్ అయ్యాక అక్కడికి రా" అంటూ హోండా దిగి ఫుట్‌పాత్ పక్కగా వున్న మామిడిపళ్ళ బండివైపు నడిచింది.

వెంటనే శబ్దం. ఉలిక్కిపడింది నీరజ.

"వామ్మో! లారీ గుద్దేసింది."

"అదేంటి! ఆ లారీ అలా వచ్చి కొట్టేసింది?" మామిడిపళ్ళవాడు ముందుకెళ్లాడు.

వెనక్కి చూసింది. అరసెకండ్... యశ్వంత్ రూపు మార్చడానికి. రక్తం మడుగులో యశ్వంత్.

ఒక్కసారి పెద్దగా అరుస్తూ ముందుకు పరుగెత్తింది.

వెంటనే దగ్గర్లో వున్న మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

ఎవరో కుదిపారు.

జయంత్, మంజుల వచ్చారు. ఆఫీస్ ఫ్రెండ్స్.

"అటు చూడు..." సుందరమ్మగారు నీరజ భుజం తట్టి తల ఊపారు.

ఆవిడ చూపించిన వైపు చూసింది నీరజ.

యశ్వంత్ తల్లి... పెద్ద జరీ అంచున్న నేత చీర... కొంగు కప్పుకున్న విధానం ఏదో గర్వాన్ని చూపిస్తోంది.

ఆవిడ పక్కన ఇద్దరు మొగవాళ్లు.

పెళ్లయ్యాక ఆవిడ దగ్గరకెళ్లినప్పుడు గుమ్మం లోపలికి రానివ్వలేదు. ఎప్పటికీ రావొద్దని, సంబంధం తెంచేసుకున్నానని చెప్పినావిడకి ఇప్పుడు ఇక్కడెందుకు? ఏం పని?

ఆ నిజమ్మీద ఈ అబద్ధం కల్చర్ కావచ్చు ఆవిడ దృష్టిలో. కులం తక్కువ వాళ్లకి సంస్కారం ఉండదన్న ఆవిడని, చాలీ చాలని ఆవిడ తీవి ఆవి

దని, రెండు మెట్లు కిందకి లాగుతోంది.

ఇన్నాళ్ల కోపం ఏమయింది? సహజంగానే ఉందా ఆవిడ ప్రవర్తన? వీళ్లది సంపదల కత్తుల ప్రపంచం. వీళ్ళు చేసే పొరపాట్లకి క్షమాపణలుండవు.

ఇన్నాళ్ళ కోపం మీద ఇప్పటి ప్రేమ ఓ బిజినెస్ అవుతుందా? ఏదైనా డబ్బు సర్దితే.. అన్న ఆలోచన వస్తోందా ఆవిడకి? ఇన్సూరెన్స్ కోసమా?

ఏదో అలజడి... ఏదో బాధ...

లోపల యశ్వంత్ ఏ విధంగా వున్నాడో... ఎదురుగా ఈవిడ.

కళ్ళు మూసుకుంది.

ఇప్పుడు మనసుని శాంత పరుచుకోవడమే జ్ఞానం.

తలుపులు తెరుచుకున్నాయి.

ఒక్కసారిగా అక్కడున్నవారిలో చైతన్యం.

డాక్టర్, నీరజ దగ్గరకొచ్చారు.

"సారీ! ఎవ్విరిథింగ్ వెంట్ రాంగ్. బ్రెయిన్‌కి రక్తం సరఫరా సరిగ్గా జరగడంలేదు. ఆక్సిజన్ సరిగ్గా అందకపోతే బ్రెయిన్ డెడ్ అవుతుంది. వెంటిలేటర్స్ పెట్టడానికి ప్రయత్నిస్తున్నాం'' అంటూ వెళ్లిపోయారు.

ఒక్కసారి నిశ్శబ్దం.

'వెంట్...రాంగ్' అంటే యశ్వంత్ బతకడా!

గుండెల్లో అగ్ని ప్రజ్వరిల్లింది.

లోపల యశ్వంత్ ఎలా వుండి వుంటాడో ఊహించుకుంటోంది.

ఒత్తుగా ఉన్న నల్లటి జుట్టుని తీసేసి ఉంటారు. ఆనవాళ్ళు పెట్టి కపాలం తీస్తారు. ఈ డాక్టర్లంతా అందులో తలలు దూర్చి జాగ్రత్తగా, అతి జాగ్రత్తగా మెల్లగా ఓ టైంబాంబుని డిప్యూజ్ చేస్తున్నట్లుగా చేతుల్ని, వేళ్లని నాజూగ్గా కదిలిస్తూ...

మళ్లా డాక్టర్ బయటకొచ్చాడు.

"డాక్టర్!'' ముందుకెళ్లింది నీరజ.

అందరూ పక్కగ్గా నుంచున్నారు.

"సారీ! ఎంత ప్రయత్నించినా ఆయనను కాపాడలేకపోయాం. అదే చెప్పానుకదా. రక్తం సప్లై అవలేకపోయింది. ప్రస్తుతం వెంటిలేటర్ మీద ఆయనున్నారు. ఆర్గాన్స్ అన్నీ పని చేస్తాయి. కానీ మరణించినట్లే లెక్క...''

ఒక్కసారి మొద్దుమారినట్లుగా అయిపోయింది.


అలలన్నీ అలా పైకెగిసి ఆగిపోయినట్లు అనిపించింది. కళ్ళు తిరిగిపోతున్నట్లుగా అనిపించి అలాగే ఒరిగిపోయింది.

"నీరూ...నీరజా!''

జీవితం ఇంత తొందరగా ముగిసిపోతుందా? కళ్లముందే... నా కళ్లముందే అంతా అయిపోయింది.


ఎన్ని కలలు... ఎన్ని ఆశలు... ఈ జీవితాన్నించి ఆశించాము. అన్నీ కూడా ముక్కలు ముక్కలుగా అయిపోయాయి. మా ప్రమేయం లేకుండా జీవితం ఎలా కరిగిపోతోందో!





## తరగని అందం

పెళ్ళయితే అందం తరిగిపోతుందనుకునే వారికి షాక్ ఇస్తుంది రమ్యకృష్ణ. సినిమాల్లో అవకాశాలు తగ్గినా ఐటెం నెంబర్ సాంగ్స్‌తో యువతని ఊపు ఊపేస్తోంది. రమ్యకృష్ణ పెళ్ళయ్యాక కూడా తన అందం రెట్టింపు అయింది అంటోంది. 'వయసు పిలిచింది' చిత్రంలో ఆమె నటన అందర్నీ అలరించేదిగా ఉందని అంటున్నారంతా. అలాగే 'అల్లుడు' చిత్రంలో జూనియర్ ఎన్టీఆర్‌కి అత్తగా నటించి మెప్పించాలని తాపత్రయపడుతోంది. ఆమె తాపత్రయం ఏ మేరకు సఫలమవుతుందో చూడాలిమరి!




లోపలికెళ్లింది నీరజ ధైర్యం తెచ్చుకుని.

తలనిండా కట్లు, ట్యూబ్‌లు, రక్తం వున్న బాగ్.

"మానిటర్ కదులుతుంటే మనిషి బతికి వున్నాడని అనుకోకండి. ఈ మిషన్ పెట్టాం కాబట్టి అవయవాలు పని చేస్తున్నాయి. మీరిక్కడ ఉండి ఏం లాభం లేదు. బ్రెయిన్ డెత్ సర్టిఫికెట్ ఇస్తాము. ఇది మెడికో లీగల్ కేసు కాబట్టి పోస్ట్‌మార్టం చేయాల్సి వస్తుంది."

అలా మంచం మీద పడుకున్న యశ్వంత్‌ని చూస్తుంటే ఏదో ఓ క్షణాన కళ్ళు తెరిచి 'ఏయ్ నీరూ' అంటాడనిపించింది.

'యశ్వంత్ ఇంక లేడు' అన్నది సత్యం కాకుండా అబద్ధం అయితే బావుంటుందని అనిపించింది అందరికి.

ఏదో మిరకల్ జరగదా! ఆగిపోతున్న జీవితాన్ని కదిలించదా? ఇంతలోపలే ముగ్గురు డాక్టర్లు వచ్చారు. అచేతనంగా వున్న వాళ్ల దగ్గరికి ఓ డాక్టర్ వచ్చి నుంచున్నాడు.

"చూడండి నీరజగారూ! ఓ మనిషి ప్రాణాలు మీరు తల్చుకుంటే నిలబెట్టగలరు!"

"నేనా... హూ... నాకే ఆ శక్తి వుంటే యశ్వంత్ ఇలా ఉండేవాడా? తన్ని బతికించుకోలేనా?" ఏడుపుగొంతుతో అంది.

"కొంతమందిని బతికించడానికి మనుషుల చేతులు, చేతలు చాలు. సోమాజీగూడాలోవున్న అలకా కార్డియాక్ ఇన్‌స్టిట్యూట్‌లో ఓ యాభై ఏళ్ళ మనిషికి యశ్వంత్ గుండె పెట్టాలని అనుకుంటున్నాము. మీ భర్త గుండెని ఇవ్వడానికి అనుమతి ఇస్తారా? మీరు ఇస్తారన్న నమ్మకంతోనే ఈ కేస్ రాగానే మిషన్ రెడీగా ఉంచాము. ఆర్టిఫిషియల్ మెథడ్‌తో గుండెని కొట్టుకోనిస్తున్నాం. మీరు సరే అంటారన్న నమ్మకంతో..."

అంటే యశ్వంత్ గుండె కొట్టుకుంటోంది.

ఆ గుండెలో గూడు కట్టుకున్న ఆశలు, ఊహలు, ఆశయాలు అన్నీ సమాధి అయిపోవడం లేదు. రెక్కలు విప్పుకుంటాయి.

గుండె యశ్వంత్‌ది. రూపం ఎవరిదైతేనేం?

మిషన్‌తోసహా యశ్వంత్‌ని అంబులెన్స్‌లోకి ఎక్కించారు.

"ఇది ఆఖరు సారి. ఈసారి యశ్వంత్‌ని చూడడం నిర్జీవంగా..." అని అనుకుంది.

వెళ్ళేప్పుడు ఓ విధంగా నిర్జీవి. వచ్చేటప్పుడు క్లినికల్‌గా డెడ్. ఆరుమంది డాక్టర్లున్న బృందం వెంటనే రెడీ అయిపోయారు. జర్నలిస్టులు, రిపోర్టర్లు, ఫొటోవాళ్ళు, వీడియోవాళ్ళు...

'ఆపరేషన్ సక్సెస్' అనేవరకూ అంతా అక్కడే వున్నారు.

ఇంత మంచి యశ్వంత్‌కి ఒక్క గుండేనా విలువైంది? ఆ కళ్ళు లేవా?

ఆ కళ్లతో ప్రపంచాన్ని చూసి ఏవో కలలు కన్నాడు. ఆ చూపుల్లో, ఆ కలల్లో పాజిటివ్ యాటిట్యూడ్స్. ఆ కళ్లని అలా మట్టిలో కప్పేయాలా? ఊహూ...

"డాక్టర్! ఏదైనా ఐ బాంక్‌కి ఫోన్ చేసి కళ్లని తీసుకోమనండి. ఇంకా ఆలస్యం ఎందుకండీ. నా యశ్వంత్ దృష్టికి అంతం ఉండకూడదు."

"అయితే నీరజగారూ! ఎంతోమందికి ఎన్నో అవయవాల అవసరం వుంటుంది. అయితే అందరూ అన్ని అవయవాలు ఇవ్వరు. వాళ్ల సెంటిమెంట్స్ వాళ్లకుంటాయి. మీరు కళ్ళు తీసుకోమన్నారు కాబట్టి చొరవకొద్దీ చెబుతున్నాను. మీవారి కళ్లే కాదు, మూత్రపిండాలు, కాలేయం, ఎముకలు... ఆఖరికి చర్మంతోసహా అవసరం వున్న రోగులు చాలామంది వున్నారు. మీ అనుమతితోనే ఈ అవయవాలన్నీ ఇవ్వడం జరుగుతుంది."

యశ్వంత్ తల్లి ఒప్పుకోలేదు.

"డాక్టర్! యశ్వంత్‌ని మరణం ఏమీ చేయలేదు. ఏం చేయలేకపోయింది. ఎంతోమందికి తన శరీరంలోని అమూల్యమైన అవయవాలిచ్చి వాళ్లకి జీవితాన్నిస్తాడంటే నాకు అభ్యంతరం ఏమీలేదు. యశ్వంత్ తల్లిగారు అభ్యంతరం పెట్టడంలో ఆశ్చర్యం ఏమీలేదు. పాతకాలం మనిషి. తర్వాత ఆవిడే అర్థం చేసుకుంటారు."

యశ్వంత్‌ని మృత్యువు తీసుకెళ్లింది. అతని అవయవాలు చిరంజీవులే.

అన్నీ తీసుకున్నాక మిగిలినదే తీసుకునేవరకూ అక్కడే ఉండిపోయింది నీరజ. ఏ కులం వాళ్లకిచ్చారని అడగలేదు. అవన్నీ ఏ మతం వాళ్లకిచ్చారు అని అడగలేదు.

"థాంక్స్ నీరజా! నన్ను అమరుణ్ణి చేసావు. ఈ మృత్యువు నాపై ఓ ముసుగేసిందేగానీ నిజానికి నన్నేం చేయలేకపోయింది. ఓ మృత్యువా! నీ గురించిన భయాలు చాలా ఉండేవి. కానీ ఇప్పుడేంలేవు. కెరటం చివరి అంచు వరకు తీసుకెళ్లావు. కానీ ఏం చేయలేకపోయావు."

వీస్తున్న ఫాన్ గాల్లోంచి తేలుతూ, హాస్పిటల్ తెల్లగోడల్లోంచి ప్రతిధ్వనిస్తూ, జనారణ్యంలో ఒంటరిగా ఉండిపోయిన నీరజకి యశ్వంత్ చెవుల దగ్గర అంటున్నట్లుగా అనిపించింది.

★